పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మానకొండూర్‌రూరల్: మండలంలోని ఊటూర్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గ్రామంలోని పాఠశాలలో 1983–84 పదో తరగతి విద్యార్థులు 40 ఏళ్ల తర్వాత ఒక్కచోట చేరి చదువుకున్న రోజులను గుర్తుచేసుకుంటూ సంతోషంగా గడిపారు. ఒకరికొకరు యోగక్షేమాలను తెలుసుకుంటూ ఆత్మీయంగా పలకరించుకున్నారు. చదువు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో చిలగాని తిరుపతి, పల్లెర్ల నర్సింహారెడ్డి, జంట్యాల జనార్దన్, పబ్బతి మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.



శంకరపట్నం: మండలంలోని తాడికల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1995–96 పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చాలా ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకొని యోగక్షేమాలను తెలుసుకుంటూ చదువుకున్న రోజులను గుర్తుచేసుకున్నారు. పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు ఐలయ్య, కుమారస్వామి, రాంరెడ్డిని ఘనంగా సత్కరించారు.



గన్నేరువరం: మండలంలోని గుండ్లపల్లి గీత ఆశ్రమ పాఠశాల 2002–03 విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థులు ఆదివారం గ్రామంలోని సాయిగార్డెన్స్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. చిన్నప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రాజు, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, బూట్ల శ్రీనివాస్, సంపత్, రవి, ప్రవీణ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సన్మానం



రామస్వామిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే సత్యం

రామడుగు: రామడుగు మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గొల్లె రామస్వామితో పాటుగా నూతనంగా ఎన్నికైన పాలక వర్గం సభ్యులు ఆదివారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కలిశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అధ్యక్షుడు గొల్లె రామస్వామిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ జవ్వాజీ హరీశ్, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మరవేని తిరుపతి, నాయకులు కోల రమేశ్, శనిగరపు స్వామి, ప్రెస్‌క్లబ్ సభ్యులు పంజాల వేంకటేశ్‌గౌడ్, షాబుద్దీన్, పూరెల్ల రవీందర్, గంగారాజు పలువురు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



నగదు అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

చిగురుమామిడి: మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన జున్నూరి శ్రీనివాస్(ఆటో డ్రైవర్) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. మిలీనియం ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం రూ.ఎనిమిదివేలు మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు తిప్పారపు సురేశ్, సభ్యులు చిప్ప తిరుపతి, లంకసిరి శ్రీనివాస్, దుడ్డేల శ్రీనివాస్, గంద్రతి రాజు, పరకాల రమేశ్, పరిపాటి మహిపాల్‌రెడ్డి, పడాల శ్రీనివాస్ పలువురు ఉన్నారు.

వాటర్‌కూలర్ అందజేత



వాటర్ కూలర్ అందిస్తున్న ఓల్డ్ స్టూడెంట్స్

రామడుగు: మండలంలోని వెదిర గ్రామీణ గ్రంథాలయంలో 1971–81 మధ్య వెదిర జిల్లా పరిషత్ పాఠశాలలో చదివిన విద్యార్థులు వాటర్ కూలర్ (డిస్పెన్సరీ)ని ఆదివారం స్కూల్‌కు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎల్ఐసీ పెద్దపల్లిశాఖ మేనేజర్ మాట్లాడారు. వాటర్ కూలర్ చాలా మందికి ఉపయోగపడుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శి రమేశ్ మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులు వాటర్ కూలర్ ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని, గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరు పాలు పంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి చందూరి రాజిరెడ్డి, పంచాయతీ కారోబార్ పన్యాల అశోక్‌రెడ్డి, ఉపాధ్యాయులు దుద్యాల శ్రీనివాస్‌రెడ్డి, వంచ వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి, ఆంజనేయులు, మునిరెడ్డి, మాధవరావు పలువురు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి అభినందన

కరీంనగర్ స్పోర్ట్స్: హాంకాంగ్‌లో ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకు జరిగిన ఏషియన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో 52 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించిన తుడి సిరిచందనను డీవైఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి ఆదివారం అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించి, దేశ కీర్తిని చాటాలని సూచించారు. ఆమెను తీర్చిదిద్దిన కోచ్ మల్లేశ్‌నూ అభినందించారు.

పవర్ కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా 11 కేవీ ఆరెపల్లి ఫీడర్ ఏరియాలో ఆరెపల్లి, రాజరాజేశ్వరి కాలనీ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రూరల్ ఏడీఈ కె.రాజు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

పోచమ్మ బోనాలు, శకటోత్సవం



రామడుగు: పోచమ్మ బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



గన్నేరువరం: మైలారం గ్రామంలో..

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శకటోత్సవం నిర్వహించారు. ఆదివారం సాయంత్రం సుందరగిరి, చిగురుమామిడి, గాగిరెడ్డిపల్లి, ఉల్లంపల్లి, కొండాపూర్, బొమ్మనపల్లి గ్రామాలకు చెందిన భక్తులు వాహనాలకు ప్రత్యేక పూజలు చేయించారు. వారం రోజులుగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు ఆదివారంతో చివరి దశకు చేరుకున్నాయి. సోమవారం రథోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. ప్రతి సంవత్సరంలాగే ఈ ఏడాది ఆలయం చుట్టూ ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలతో భక్తులు ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గందె సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. రథోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని, ఎలాంటి లోటు రాకుండా ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రాజ్‌కుమార్, క్లర్క్ కవిత, సభ్యులు తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా బందోబస్తు నిర్వహిస్తున్నామని చిగురుమామిడి ఎస్సై బి రాజేశ్ తెలిపారు.

మైలారంలో పోచమ్మ బోనాలు

గన్నేరువరం: మండలంలోని మైలారం గ్రామంలో ఆదివారం మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని కొక్కెరకుంట గ్రామంలో పోచమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. ఇంటింటి నుంచి ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఎంపీపీ జవ్వాజీ హరీశ్ ప్రత్యేకంగా పూజలు చేశారు.

ఒగ్గు కళాకారుల వీర గంధాలు

చొప్పదండి: మండలంలోని చాకుంట గ్రామంలో బీరయ్య పట్నాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం వీరగంధాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒగ్గు కళాకారులు కత్తులతో విన్యాసాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో గ్రామంలోని కుర్మ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పెద్దమ్మ పట్నాలు ప్రారంభం

చొప్పదండి: మండలంలోని చిట్యాలపల్లి గ్రామంలో ఆదివారం పెద్దమ్మ పట్నాల కార్యక్రమం ప్రారంభమైంది. ముదిరాజ్‌ల ఆరాధ్య దైవం పెద్దమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఆదివారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. బుధవారం పెద్ద పట్నం వేసి అమ్మవారికి బోనాలు సమర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్ర

శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్, లింగాపూర్ గ్రామాల్లో ఆదివారం హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. హనుమాన్ మాలాధారణ భక్తులు భజనలు, సంకీర్తనలు చేస్తూ శోభాయాత్రలో పాల్గొన్నారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.

చొప్పదండిలో రేపు

చొప్పదండి: పట్టణంలోని పుర వీధుల గుండా మంగళవారం హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తామని అంజన్న దీక్షా పరులు తెలిపారు. హనుమాన్ సమేత సీతారాముల విగ్రహాలతో పోస్టాఫీసు సమీపంలోని భక్తాంజనేయస్వామి ఆలయం నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతుందని, హనుమాన్ దీక్షా పరులకు అన్నదానం ఉంటుందన్నారు. పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని కోరారు.



చిగురుమామిడి: సుందరగిరిలో శకటోత్సవం



చొప్పదండి: బోనాలు సమర్పిస్తున్న ముదిరాజ్‌లు



చొప్పదండి: కత్తులతో కళాకారుల విన్యాసాలు

పార్టీ బలోపేతానికి పని చేయాలి



మాట్లాడుతన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు

జమ్మికుంట: కాంగ్రెస్ పార్టీలో కొంత మంది విభేదాలు సృష్టించే విధంగా, నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌ను కించపరుస్తూ వ్యతిరేకంగా మాట్లాడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పార్టీ సీనియర్ నాయకులు పత్తి కృష్ణారెడ్డి, పొనగంటి మల్లయ్య, దేశిని కోటి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సీనియర్ నాయకుడు సుంకరి రమేశ్ ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త పని చేయాలని అందరిని కలుపుకొని పని చేయాల్సి అవసరం ఉంటుందని, కించపరుస్తూ మాట్లాడితే చర్యలు తప్పవన్నారు. గతంలో పని చేసిన బల్మూరి వెంకట్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి స్థానిక నాయకుడు వొడితెల ప్రణవ్‌కు టికెట్ కేటాయించిన పరిస్థితిని గుర్తుంచుకోవాలన్నారు. మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటే విధంగా పనిచేయాలని పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వీరన్న, భిక్షపతి, రవి,నాయకులు శ్రీహరి, సదానందం, రేణుక శివకుమార్, సజ్జు, రవి, అశోక్, దీక్షిత్ నాయకులు పాల్గొన్నారు.

'వొడితెల ప్రణవ్‌ను విమర్శిస్తే సహించం'

హుజూరాబాద్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌ని విమర్శించే స్థాయి తుమ్మేటి సమ్మిరెడ్డికి లేదని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిప్పారపు సంపత్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినా నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి అలుపెరగని కృషి చేస్తున్నారని, అలాంటి వ్యక్తిపై విమర్శలు సరికాదని, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ పేరుతో స్థానిక నాయకులు చిచ్చు పెట్టాలని చూస్తున్నారని, విమర్శలు మానుకొని ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు.

చిడతల రామాయణం ప్రదర్శన



ఇందుర్తి గ్రామంలో నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి గ్రామంలో రెండు రోజులుగా రాత్రివేళ చిడతల రామాయణ నాటకం ప్రదర్శిస్తున్నారు. శనివారం రాత్రి కళాకారులు తమ పాత్రలను ఎంతగానో రక్తి కట్టించారు. నాటక ప్రదర్శన గురువు గొల్ల కనకయ్య టెంకాయ కొట్టి జ్యోతి ప్రజ్వలన చేసి నాటకాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ చిడుతల రామాయణం మానవ సంబంధాలను వివరిస్తుందన్నారు. అన్నదమ్ములు, తండ్రికొడుకులు, భార్యాభర్తల అనుబంధాలను అర్థం చేసుకుంటూ కలిసిమెలిసి ఉండాలని కోరారు. కార్యక్రమంలో కళాకారులు అందె పోచయ్య, భూమయ్య, అందె స్వామి, కొంకటి లక్ష్మణ్, బాలయ్య, చంద్రయ్య, కుట్ల మొగిలి, శంకర్, రాజయ్య, సంపత్ పాల్గొన్నారు.

సోలార్ లైట్లు వెలుగతలేవు

- చీకట్లో ముల్కనూర్ గ్రామస్తులు
- కేసీఆర్ ఆదేశాల మేరకు ఏర్పాటు
- పట్టించుకునే నాథుడే కరువు
- బ్యాటరీలను ఎత్తుకెళ్లిన వైనం



చిన్నముల్కనూర్‌లోని సోలార్ స్తంభం



గ్రామస్తులతో మాట్లాడుతున్న కేసీఆర్ (ఫైల్)

చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్ గ్రామంలో ఇంటింటికి మాజీ సీఎం కేసీఆర్ ఏర్పాటు చేయించిన సోలార్ లైట్లు సాంకేతిక కారణాల వల్ల వెలగడంలేదు. కనీసం వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడని గ్రామస్తుల నుంచి ఆరోపణలు వెలువడుతున్నాయి. మాజీ సీఎం కేసీఆర్ పదవీలో ఉండగా 2015 జూలైలో చిన్నముల్కనూర్ గ్రామాన్ని దత్తతీసుకున్నాడు. గ్రామంలో పాడుబడిన ఇళ్లను కూల్చివేసి వాటిస్థానంలో 248 డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేశారు. హరితహారంలో భాగంగా అదే ఏడాది ఆగస్టులో రెండోసారి గ్రామానికి వచ్చి గ్రామస్తులతో మాట్లాడారు. ఉపాధి అవకాశాలను కల్పిస్తానన్నారు. 2016లో మూడోసారి వచ్చిన కేసీఆర్ డబుల్ బెడ్‌రూం ఇండ్లకు శంకుస్థాపన చేశారు. రెండు విడతలుగా 248 డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించారు. అలాగే కేసీఆర్ ఆదేశాలతో 2017–18వ సంవత్సరంలో ఇండ్ల ముందు సోలార్ లైట్లను ఏర్పాటు చేశారు. ఈ లైట్లు మహారత్న కంపెనీ ఎన్‌టీపీసీ రామగుండంకు చెందిన వారు అమర్చారు. ఇవి అమర్చి ఆరేళ్లు గడిచినప్పటికీ నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. సోలార్ లైట్ల నిర్వహణపై పంచాయతీ పాలకవర్గానికి, ఆయా సంవత్సరాల్లో బాధ్యతలు చేపట్టిన పంచాయతీ కార్యదర్శులకు కూడా సరైన అవగాహన లేదు. దీంతో గ్రామస్తులు చిమ్మచీకట్లో ఉంటున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 248 సోలార్ లైట్లలో పది లైట్లు మాత్రమే వెలుగుతున్నాయి. కాగా ప్రతి ఆరు నెలలకోసారి సోలార్ లైట్ల బ్యాటరీల్లో డిస్టిల్ వాటర్‌ను మార్చాల్సి ఉంది. ఏళ్లు దాటుతున్నా వాటర్ మార్చకపోవడంతో వీధులన్నీ చిమ్మచీకట్లో మగ్గుతున్నాయి. ఈ విషయంపై మండల, జిల్లాస్థాయి అధికారులకు ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం. సోలార్ విద్యుత్ స్తంభాలకు అమర్చిన బ్యాటరీలను గుర్తు తెలియని వ్యక్తులు తస్కరించారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి జ్యోతి రెండు రోజుల క్రితం చిగురుమామిడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. గ్రామంలో అమర్చిన లైట్లు వెలగకపోవడం, వాటికున్న బ్యాటరీలను చోరీ చేయడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ ప్రజాప్రతినిధి, అధికారులు పట్టించుకోకపోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ గ్రామంలో వెలగని సోలార్ లైట్లను మరమ్మతు చేయించాలని కోరుతున్నారు. చిన్నముల్కనూర్‌లో 248 సోలార్ లైట్లు ఉన్నాయి. వాటిలో చాలా వరకు వెలగడంలేదు. బీఆర్ఎస్ పాలనలో అప్పటి సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు అమర్చారు. వీటి నిర్వహణపై ఉన్నతాధికారుల నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు లేవు. ఇటీవల కొన్నింటి బ్యాటరీలను ఎవరో దొంగిలించారు. వాటిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని పంచాయతీ కార్యదర్శి జ్యోతి తెలిపారు.

పచ్చని చెట్లను కాల్చేశారు





జమ్మికుంట: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి సంరక్షణ చేస్తుంటే జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మడిపల్లి రైల్వే గేటు రోడ్డు పక్కన పచ్చటి చెట్లను ధ్వంసం చేయడమే కాకుండా కాల్చివేశారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది హరితహారంలో భాగంగా ఏళ్లుగా నీరు పోసి సంరక్షిస్తూ చెట్ల పెంపకం చేపడుతుంది. కానీ ఓ వ్యవసాయ భూమికి చెందిన వ్యక్తి భూమిలోని చెత్తాచెదారంతో పాటు రోడ్డు పక్కన ఉన్న చెట్లను సైతం కాల్చివేశాడు. సంబంధిత అధికారులు ఆ వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని సర్వత్రా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పచ్చటి చెట్లను రక్షించాలని బాటసారులు, ప్రకృతిని ఆస్వాదించేవారు కోరుతున్నారు.

బ్లాక్ బెల్ట్‌ల ప్రదానం

కరీంనగర్ స్పోర్ట్స్: ఒకినావా మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో స్థానిక జగిత్యాల రోడ్‌లోని వివేకానంద స్కూల్‌లో కరాటే చిన్నారులకు ఇటీవల పోటీ పరీక్షలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఆదివారం కరీంనగర్ రూరల్ ఏసీపీ వెంకటరమణ బ్లాక్ బెల్ట్‌లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. ఆత్మస్థైర్యానికి, ఆత్మ విశ్వాసానికి కరాటే దోహదం చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఇందులో శిక్షణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో అకాడమీ చీఫ్ ఎగ్జామిన ర్ కె.వసంత్‌కుమార్, ఇన్‌స్ట్రక్టర్లు శ్రీనివాస్, ప్రవీణ్, శ్రీనివాస్, రాజశేఖర్, రిషికుమార్, రాకేశ్, శరత్ పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంఇరుకుల్లలో తాటిచెట్టు పైనుంచి పడి, ఓ గీత కార్మికుడికి గాయాలయ్యాయి. బుర్ర తిరుపతిగౌడ్ ఆదివారం తాటి చెట్టు ఎక్కి, కల్లు గీస్తున్నాడు. ప్రమాదవశాత్తు మోకు జారడంతో కిందపడ్డాడు. కుడికాలు విరిగి, పలు చోట్ల గాయాలయ్యాయి.

ఎల్లుండి హనుమాన్ చాలీసా పారాయణం

కరీంనగర్ కల్చరల్: నగరంలోని 36వ డివిజన్ వాణి సూపర్ మార్కెట్ పక్కన బుధవారం సాయంత్రం 6.30 గంటల నుంచి బోగ శ్రీనివాస్ గురు స్వామి ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం, అయ్యప్ప భక్త బృందం భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శబరిమల అయ్యప్ప మహాపాదయాత్ర గురుస్వామి గడప నాగరాజు ప్రకటనలో తెలిపారు. హనుమాన్, అయ్యప్ప దీక్షాపరులు, భక్తులు తరలివచ్చి, విజయవంతం చేయాలని కోరారు.

తడిసిన వడ్లు కొనాలి

కరీంనగర్: జిల్లాలో అకాల వర్షాలకు తడిసిన వడ్లను మద్దతు ధరతో కొనుగోలు చేయాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని రోజులుగా అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసి, సరైన ధర రాక అన్నదాతలు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేసిందన్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం త్వరగా తడిసిన వడ్లను కొనుగోలు చేసి, వారిని ఆదుకోవాలని కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అజయ్, హ్యూమన్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు మొగిలి సతీశ్, నాయకులు శంకర్, అంజయ్య తదితరులున్నారు.